# 22. యాభైవెళ్ళి, ఇంకేం పెళ్ళి?

ఇలాంటి ఉత్తరం నా నుంచి నువ్వు ఊహించి ఉండవు. ఇది పూర్తిగా చదివేక నామీద ఉన్న యిదివరకటి నీ అభిప్రాయం పూర్తిగా మారిపోవచ్చు. కాని దానికి నేను చేసేది ఏమీలేదు. కాని మనిషి అన్ని గుణాలలోనూ గొప్పది తను మనసారా ప్రేమించిన ఒకే ఒక వ్యక్తితో అయినా నిజం చెప్పగలగడం. ఎదురు గుండా చెప్పలేకపోవడం బలహీనతే. కాని యీ విధంగానైనా నా బాధ్యత నిర్వర్తించ గలిగినందుకు నన్ను నేను మెచ్చుకుంటున్నాను. నువ్వెవరో నీకు గుర్తుచేసేందుకు చేసే నా యీ శ్రమ నీ ఆప్పుడనైన నేను నా కనీస ధర్మంగా భావిస్తున్నాను.

రెండేళ్ళ కిందట, నువ్వూ, మీ అన్నయ్య సుబ్రహ్మణ్యం, సికిందరాబాదు స్టేషనుకి వచ్చి నాకు వీడ్కోలు యిచ్చినప్పుడు అన్న మాటలు యిప్పుడు గుర్తుచేసుకుంటున్నాను.

'ఇన్స్టిట్యూట్ పూర్తి జీతం మీద నీకిచ్చిన శలవు రెండు సంవత్సరాలు. ఈ వ్యవధిలో, ఎప్పుడూ అడుగుపెట్టి ఎరగని ఆ ఢిల్లీ యూనివర్సిటీలో, కేవలం రీసెర్చి సదుపాయాలు ఉన్నంత మాత్రాన, డాక్టరేటు తెచ్చుకోడం సామాన్యమైన కృషితో జరిగే పనికాదు! అది లేకపోతే ఇక్కడ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా ఫిక్స్ అవడం జరగదు''.

'ఇవన్నీ నాకిప్పుడు ఎందుకు చెబుతన్నట్టు, నాకు తెలియవనా'!

'తెలియవనికాదు. ఆ టర్మ్ పూర్తి అయాక నిన్ను రిసీవ్ చేసుకోడానికి యిలాగే స్టేషన్‌కి వస్తాను. అప్పటిదాకా నామీద ధ్యాస నీ చదువుకి అడ్డువస్తే అది నేను సహించలేను. నన్నే క్షమించుకోలేను!

అటూ ఇటూ చూశాను. మీ అన్నయ్య ఎవరో ఫ్రండ్‌తో కాబోలు కబుర్లలో బిజీగా ఉన్నాడు. కిటికీలోంచి నీ చెయ్యి తీసుకుని నా బుగ్గ ఆనించి 'అది నాకెలా సాధ్యం రమా!' అని అడిగాను.

నీ జవాబు మరిచిపోలేను. నువ్వంత ప్రాక్టికల్‌గా మాట్టాడగలవని నేనెప్పుడూ అనుకోలేదు.

'చూడు ప్రకాశం, నీ ఎమ్మెస్సీ ఫైనల్ పరీక్షలకి నెల్లాళ్ళ ముందు నువ్వు దేవతలా ఆరాధించే మీ పెద్దత్త చచ్చిపోయింది. అప్పటి నీ షాక్ తలుచుకుంటే నాకు మతిపోతుంది యిప్పటికీ, అయితే నీ పరీక్ష ఏమైంది? యూనివర్సిటీ ఫస్టు తెచ్చుకోలేకపోయావుగాని హై ఫస్టు క్లాసులో నువ్వేగా ప్యాసయిందీ! ఈ ట్రెయిన్‌లాగే మన బ్రెయిన్‌లోకూడా డిఫరెంట్ కంపార్ట్‌మెంట్స్ ఏర్పరుచుకోవాలి. లేకపోతే బతుకులో నెగ్గలేం. ఏమంటావు!'

'ఏమో మరి, మనల్నిద్దర్నీ యింత సన్నిహితుల్ని చేసింది బతుకులో నెగ్గడంకాదు, ఓడిపోడం అని నా ఉద్దేశం.'

'ఏదో చదువంటే వంటబట్టిందిగాని, కాలేజీలో చేరింది మొదలు డబ్బుకోసం నేనెంత కటకటపడిపోయానో నువ్వు ఎరగంది కాదు. ఉన్నట్టుండి నాన్నగారి ఉద్యోగం పోయింది. ఏదో కేసులో బావ ఇరుక్కుంటే అక్కయ్య పిల్లలతో మా ఇల్లు చేరక తప్పలేదు. అమ్మకి మళ్ళీ తిరగబెట్టింది.

ఎలాగో స్కాలర్‌షిప్‌తో చదువుకున్నానుగాని పై ఖర్చులో? చెల్లెలికి స్కూలు ఫీజ్, దాని పెళ్ళిమాటో? ఇక మీఇంటి పరిస్థితులు మాత్రం ఏమంతమెరుగ్గా ఉండేవని! మీ అన్నయ్యకి బాంక్‌లో ఉద్యోగం అయిందని ఆ పల్లెటూరు వదలి యిక్కడికొచ్చారుగాని ఏం సుఖపడ్డారని!'

"చేతి ఖర్చు వదిలిపోడమేగాని మీకూ మీ పినతండ్రికీ ఉన్న ఆస్తి వ్యవహారం ఇంకా కోర్టు తీర్చలేదు. నెలకి పాతికయిచ్చి ట్యూషన్ పెట్టించినా మీ తమ్ముడు మెట్రిక్ గట్టెక్కలేదు. పుట్టింటి నుంచి యింకా డబ్బు తెమ్మని మీ అక్కని మీ బావ కొట్టడం మానలేదు. నైట్ కాలేజీలో చేరి బియ్యే పూర్తిచేద్దామనే నీ కోరిక తీరనేలేదు.

మా కుటుంబాన్ని అంతా ఆదుకుందామని కాదు గాని నా మీద ఎందుకో ప్రత్యేకమైన అభిమానం ఉండేది పిల్లలు లేని మా పెద్దత్తకి. "ఒరే నానిగా! నూరుతులాల బంగారం ఉంది నా ఒంటిన. నా సొంత మేనల్లుడు ఫీజు కట్టలేక చదువు మానేశాడంటే ఆనాడే నేను చచ్చిపోయానని గుర్తుపెట్టుకో" అనేది. అంత పెద్ద సమిష్టి కుటుంబంలో ఉంటూ నాకు రహస్యంగా డబ్బు పంపడానికి ఎంత అవస్థ పడేదని!

మీ కలకత్తా మామయ్య గురించి కూడా నువ్వూ అలాగే చెప్పేదానివి. "మా మావయ్య చదువంతా పూర్తిగా మా నాన్నే చెప్పించాడుట. ఆనాడు మా నాన్న సమయానికి ఆదుకొని యింతవాణ్ణి చెయ్యబట్టే తనిప్పుడు వెయ్యి రూపాయలు తెచ్చుకుంటున్నాడట. ఇప్పుడు నాన్న చిక్కుల్లో ఉన్నాడు గనుక తను నెలనెలా రెండొందలు పంపి ఋణం తీర్చుకోక మానడుట. విన్నావా ప్రకాశం. ఇదేమైనా బాగుందా! ఎంత తెచ్చుకుంటే మాత్రం నలుగురు పిల్లలతో అక్కడ ఏం సరిపోతుంది చెప్పు? మా ఆస్తి వ్యవహారాలు తేలకపోవచ్చు. నాన్నకి యింకా అనేక బాధ్యతలు ఉండిపోవచ్చు. అన్నయ్యకి మంచి ఉద్యోగం అయింది కదా, ఎక్కడికి దీనికి! ఓసారి నేనే చాలా స్ట్రాంగ్‌గా రాశాను మామయ్యకి. 'కనీసం యింకో ఏడాది యిలా పంపక మానను. ఎప్పుడైనా మనియార్డరు తిరక్కొట్టేరో యిక మీ గుమ్మం తొక్కను' అని వెంటనే రిప్లయి. ఏం చెప్పను!

నువ్వు అలా మాట్లాడుతున్నప్పుడూ, మా పెద్దత్త గురించి నేను చెబుతున్నప్పుడూ నువ్వు ఎంతో ఆసక్తితో వింటున్నప్పుడూ, మనిద్దరం ఎంతో ఎంతో దగ్గరివాళ్ళం అనిపించేది. ఇదంతా ఎందుకు రాశానంటే ఒక మనసుని ఇంకొక మనసుతో అతి దగ్గరగా అతికించే శక్తి ఉన్నది కన్నీటి చుక్కకి మాత్రమే అని చెప్పడానికి.

ఇటు నేనెక్కిన రైలు కదిలింది. అటు నువ్వెక్కిన సిటీబస్సు కూడా కదిలి ఉంటుంది. ఒకర్నుంచి ఒకరు దాచిపెట్టుకున్న దుఃఖం కూడా కదిలి, కరిగి, కాలవలై ఉంటుంది. మనం మరి మనసున్న కుర్రాళ్ళమో, మరలమో, రాళ్ళమో, రెండేళ్ళ కాలం కూడా కళ్ళముందే కదిలింది.

ఈ రెండేళ్ళపాటూ ఏ క్షణమూ నిన్ను మరచిపోలేదనడానికి నా మనస్సే నాకు సాక్షి. కాని పైకి కనిపించని సాక్ష్యంతో తృప్తిపడని బలహీన మానవ ప్రకృతి మనది. నీ తీపి గురుతులు రెండు

నాతో పాటు ఢిల్లీ తెచ్చుకున్నాను. నీ ఫుల్‌సైజు ఫోటో ఒకటీ, రెండొందల ఏభైమంది కేండిడేట్స్‌లో ఫస్టు కొట్టుకొచ్చిన నీ మెట్రిక్ మార్కుషీటు కాపీ ఒకటీ.

"సౌందర్యం ఆరోగ్యం జతపేరే మనోరమ" అనేది మొదటిది.

"సామర్థ్యం వైదుష్యం కలగలుపే మనోరమ" అనేది రెండోది.

"మనోరమని మనువాడే మగవాడే మాన్యుడు" అనేది మనసులాంటి అద్దం దాన్ని చూసి కళ్ళెర్రచేసేవాణ్ణి. 'ఎవడనుకున్నావ్ రా ఆ మహానుభావుడు! నేనే! ' అని మీసం మెలేసేవాణ్ణి. ఆ ఊపు నాకు ఊపిరి. ఆ భావం నాకు బలం. దాన్తోనే డాక్టరేటు కొట్టుకొచ్చేను. అది సంపాదించింది నేనే గాని అలా సంపాదించి పెట్టింది మాత్రం నువ్వే.

ఇన్‌స్టిట్యూట్ నుంచి ప్రతినెలా కట్స్ పోను అయిదొందల యాభై అందేది. రెండొందల యాభై యింటికి, సింహాచలం పంపేవాణ్ణి. ఎంత ఫ్రెండ్స్‌తో ఉండి జాగ్రత్తగా గడుపుకున్నా రెండొందల యాభై అయితే గాని నాకు యీ ఢిల్లీలో కటకట అయిపోయేది. నీకు ఏభై మాత్రమే పంపేవాణ్ణి. దాన్తో మీకు ఏం సాయం చేసేవాణ్ణో ఏమో! 'ఉత్తరాలు రాసుకోకూడదు' అని మనం ఒట్టు పెట్టుకున్నాం. 'మనం' ఏమిటి, నా చదువుకి ఎక్కడ అడ్డొస్తుందో అని తమరే అలా నిర్ణయించి అమలు జరిపేరు. ఏం చేస్తాం, కటకటాలూ, కట్టుదిట్టాలూ ఎవరికీ కమ్మగా ఉండవు. నిజం చెబుతున్నాను, నెలకో ఉత్తరం అంది ఉంటే నీ గురించి యింతగా రాత్రింబవళ్ళు పరితపించేవాణ్ణి కాదేమో! మనియార్డరు రసీదు కోసమే మహ తహతహపడేపోయేవాణ్ణి. జి. మనోరమ' అనే సంతకంలోని ఆ అక్షరాలే నా హృదయానికి పంచామృతాలు. నా మనసుకి పంచవాక్యాలు.

ఊహల ఉనికి ఆకాశంలో అయితే నిజాల పునాదులు భూమ్మీదే కదా! రెండేళ్ళు తక్కువ కాలమేమీ కాదు. నువ్వెలా ఉన్నావో మీ కుటుంబంలో ఏమేం మార్పులు వచ్చాయో అని ఎప్పుడూ ఆలోచిస్తూ ఉండేవాణ్ణి. ఎన్నో అసందర్భపు ఆలోచనలు నన్ను సతమతం చేసేవి. మన కలయికకి కారణం అయిన నా ఫ్రెండూ మీ అన్నయ్యా అయిన సుబ్రహ్మణ్యం గాడు పోనీ ఏవైనా ఓ రెండు ముక్కలు రాస్తాడా అంటే 'ఉత్తరాలు రాయకపోవడం కూడా ఓ ఘనకార్యమే' అని చెప్పుకునే సిగ్గు ఒదిలేసిన వాళ్ళ జాబితాలో వాడిది మొట్టమొదటి స్థానం మరి.

మా వాళ్ళ భోగట్టాలు మాత్రం నాన్నగారి క్షేమ సమాచారాలతో ఎప్పటికప్పుడు తెలిసేవి. అప్పుడప్పుడు, చెల్లి రెండు ముక్కలు చేర్చేది. మనం ఇలా కొత్తరకం ఉత్తరాల మూగనోము పట్టేమని దానికి తెలీదు కదా! ఏవేవో రాస్తావు గాని కాబోయే మా వదిన గురించి ఒక్క ముక్క రాయవేం! అని నిలదీసేది. 'చదువూ, అందమూ దేనికది ఉన్న మనోరమ అసలే అదృష్టవంతురాలు. దీనికి తోడు ఇప్పుడు 'యిది' కూడా. మాకు ఆలస్యంగా తెలిసిందనుకో. ఇంత మంచి సంగతి మా చెవిని వెంటనే వెయ్యాలని నీకైనా తోచలేదా?' ఏడాది అయాక అనుకుంటా. ఓసారి చెల్లి యిలా రాసిన ముక్కలు అర్థంకాక ఆశ్చర్యపోయాను నేను. దానికి తోడు ఇప్పుడు 'ఇది' కూడా ఏమిటిది? మీ నాన్నగారి

చిక్కులు నాకు తెలియనివి కాదు. ఏదో ఒకటి తొలగిపోయి ఉంటుంది. అంతకంటె ఏముంది అని సరిపెట్టుకొని ఇది మంచి సంగతే కదా దీని గురించి బుర్రబద్దలు కొట్టుకోవడం దేనికని నా రీసెర్చి వ్యవహారంలో మళ్ళీ మునిగిపోయాను నేను.

ఎలా అయితేనేం కఠినమైన కాలం గడిచిపోయింది. డాక్టర్ ప్రకాశరావు అనిపించుకో గలిగాను, అనుకున్న వ్యవధిలోనే. మంచి స్కేలు ఉన్న పెద్దపోస్టులో పాతికేళ్ళు నిండగానే జాయిన్ అవుతున్నాను. గనుక కొంతవరకైనా కన్నతండ్రి కన్నీళ్ళు తుడవగలను. తెలిసిన మీలాంటి కొన్ని సంసారాలకి కొంతవరకైనా తోడ్పడగలను. ఇలాంటివి తలుచుకుంటే ఒళ్ళంతా పులకించిపోయింది. నిజంగా ఈ రెండేళ్ళు గడవడం అంత కష్టమే కాలేదనీ, తిరుగు ప్రయాణమే ఎన్నో కోట్ల యుగాలనీ అనిపించింది. రైలు ఎక్కడైనా నాకు బోధపడని కారణాల చేత ఆగితే చాలు. దిగి డైనమైటు పెట్టి పేల్చేద్దామా అనిపించేది.

ఎన్నో ఆశలతో ఆదర్శాలతో ఎలాగయితేనేం ఇక్కడికి తిరిగి వచ్చిన నాకు ఏం దొరికింది? ఎలా వచ్చింది నీలో యింత మార్పు? రెండేళ్ళ కొద్దివ్యవధిలో ఓ మనిషిలో ఇంత తేడా సహజమా, లేక మొదట్లోనే నా అంచనా తప్పా? కలకల నవ్వుతూ ఏ కల్మషమూ కనపడని ఆ ఫోటో నీది కాదా! అందరిలో మొదటిదానిగా వచ్చేనని చెబుతున్న ఆ సర్టిఫికేటు నీది కాదా? కాకపోవడమేం, నీ అందచందాలకీ, మేధాసంపదకీ తప్పకుండా అవి యోగ్యతా పత్రాలే! ఇప్పుడు బాధపడి లాభమేముంది, 'సహృదయానికి సర్టిఫికేటు అనేది కాగితం మీద దొరకదు' అనే చిన్న విషయం నాకు తెలియకుండా పోయాక!

తిరిగొచ్చేక ఆ రోజు నిన్ను స్టేషన్లో కలవడమే, తర్వాత ఇనిస్టిట్యూట్‌లో హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్‌గా బాధ్యత వహించి ఆ పనులు చూసుకోడంలో ఊపిరి తిరగలేదు. సుబ్రహ్మణ్యం కోసం బ్యాంకుకి ఫోన్ చేద్దామంటే, ఏదో ట్రెయినింగ్‌కి కలకత్తా వెళ్ళేడని, నువ్వే అనుకుంటాను, చెప్పేవు. నాలుగైదు రోజులు తర్వాత ఎలాగో వీలు కలిగింది. మనసు తీరా నీతో మాట్లాడదామనే నా చిరకాల వాంఛ ఎలా అయితేనేం క్రమంగా తీర్చుకున్నాను. అయినే నీ నోటంట వచ్చిన ఒక్క విషయం ఒక్కొక్క బాంబ్‌షెల్‌గా నా మనసు రిసీవ్ చేసుకుందని నువ్వెరగవు. అయితే మా చెల్లి ఉదహరించిన 'ఇంత మంచి సంగతి' ఇదా? నేను వెళ్ళిన రెండు నెలలకి నీకు రాజస్థాన్ లాటరీలో ప్రైజ్ వచ్చిందా! ప్రైజు మించిన సర్‌ప్రైజ్ ఆ సంఘటన నీపై యింత ప్రభావం చూపించ గలిగిందా!

ఇలా రాశావు నువ్వు :

... అంతదూరంలో ఉండి ఆ రీసెర్చి హడావిడిలో పడి నువ్వైతే పట్టించుకోలేదు గాని ఈ వార్త దాచడానికి నేనెంత శ్రమపడవలసి వచ్చిందో నీకేం తెలుసు! ఓ ఆడదానికి యింత అదృష్టం కలిసి వస్తే లోకం ఏడుపుకి ఇక అంతూ పంతూ అంటూ ఉంటుందా? ఎంతో దగ్గిరవాళ్ళే బయటపడిపోయారు. మొహామొహాలు చూసుకున్నారు. నెలనెలా రెండొందలు పంపేవాడా మా కలకత్తా

మావయ్యా. యీ సంగతి యిలా తెలీడమేమిటి, అలా పైసా పంపడం బంద్ చేసేశాడు! పెద్దవాడు మళ్ళీ. ఆ మాత్రం జ్ఞానం ఎందుకు లేకపోయిందో తెలీదు. లాటరీ వచ్చింది నాకు గాని మా నాన్నకి కాదుగా? .... 'అదేమిటి రమా నీ డబ్బూ, మీ నాన్న డబ్బూ ఒకటి కాదూ! తిండిలేక పస్తులు పడుకోలేదు గాని మామూలు కోరికలు తీరే డబ్బు లేక మీ కుటుంబం ఇబ్బంది పడేవారని ఎన్నోసార్లు నువ్వే చెప్పేవు. ఎలా అయితేనేం అనుకోనిది కలిసి వచ్చింది. మాటవరసకి బాపట్లలో మీ పాత యింటి మీద ఏదో అప్పుందని అనుకునేవారు. అది ఈ డబ్బుతో తీర్చేసుకొని బాగు చేయించుకొని అద్దెకిచ్చేస్తే కొంత నయం కదా!' అని నా ఉద్దేశ్యం అయితే.

'.... బాగుంది నేనెందుకు తీర్చాలి మధ్య? నాన్న ఆ యిల్లు మొగపిల్లలిద్దరికీ ఎప్పుడో రాసేశారు. ఇంతకీ ఒకరు ఆదుకునే దురవస్థలో ఏం లేడు ఇప్పుడు మా నాన్న. మా ఆస్తి వ్యవహారాలు తేలి మాకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఖర్చులతో సహా అంతా రాబట్టుకోడమే యిక తరువాయి....'

ఇంకా మన అభిప్రాయాలు ఇలా నడిచాయనుకోవచ్చు.

"పోన్లే పాపం. ఇందర్నీ దేవలేక మీ సుబ్రహ్మణ్యం నానాయాతనా పడేవాడు"

"నువ్వనుకున్నంత అమాయకుడేం కాదు మా అన్నయ్య. నువ్వు వెళ్ళిన ఏడాదికి అనుకుంటాను. చడీ చప్పుడూ లేకుండా ఎంతపని చేశాడో వింటే ఆశ్చర్యపోతావు. వాళ్ళ కేషియర్ శరత్‌చంద్రన్ లేడూ, వాళ్ళ రెండో అమ్మాయి లావణ్యని గుళ్ళో పెళ్ళాడేశాడు! ఆ అమ్మాయి విడో కూడా!"

"ఇంకేం, ముందే చెప్పవేం మరి! మనవాడు వీరేశలింగం శిష్యుడు అయాడన్నమాట!"

"వీరేశలింగం శిష్యుడవునో కాదో నాకు తెలీదు గాని పీసీ సర్కార్ గురువు అంతటివాడు మాత్రం అవును!"

"అదేమిటి?"

"అవును మరి! కట్నం అని తీసుకుంటే కన్నవారి కింద కొంతైనా ఖర్చుపెట్టవలసి ఉంటుంది. లాంఛనాలు అయితే ఆడపడుచుకి వాటా పెట్టాలి. లావణ్య మొదటి మొగుడు రెండంతస్తుల మేడ పెళ్ళాం పేర రాసి మరీ చచ్చేడు. పన్నులు పోను నెలకి రెండువేలు అద్దె చేతికొస్తుందని వాళ్ళే చెప్పిన మాట. ఇప్పుడు చెప్పు. ఎలా ఉందంటావ్ మా అన్న మేజిక్? యేం మాట్లాడవేం. ఎన్నో కబుర్లు చెప్పేవాడివి, ఢిల్లీ వెళ్ళొచ్చేక మరీ గంటకో మాట ఆడుతున్నావేం? యే హిందీ సుందరో నిన్ను బందీ చెయ్యలేదు గద! అంత సులువుగా నన్ను తప్పించుకు పోలేవు సుమా!"

"ఏమో! మునుపటి మాట చెప్పలేను. నీ ఒక్కొక్క పలుకుతో మన మధ్య ఒక్కొక్క గొలుసు వదులయిపోతున్న మాట మాత్రం నిజం."

"ఇంతకీ అంత డబ్బు ఏంచేశానో అడగవేం!"

"వారం రోజులు యెడతెరిపి లేకుండా ఆలోచించాను. ఎందర్నో కలుసుకొని ఎన్నెన్నో

భోగట్టాలు చేశాను. ఆఖరికి నా పేర అంత డబ్బూ పదేళ్ళకి లాంగ్‌టర్మ్ ఫిక్సెడ్ డిపాజిటులో పడేశాను. నెలకి నాలుగొందల వడ్డీ కాళ్ళ దగ్గరకొచ్చి పడుతుంది. అన్నట్టు యింకో ముఖ్య విషయం చెప్పాలి నీకు. మన పెళ్ళి విషయం చాలా తొందరపడుతున్నాడు నాన్న. ఇప్పుడు తను తెచ్చుకున్న పొలం యెంతలేదన్నా యెకరం పదివేలు తక్కువ పలకదు తెలుసా? ఆ రోజుల్లోనే మా అక్కకి పదితులాల బాలతొడుగు కాక పన్నెండు వేలు కట్నం ఇచ్చారు, రెండోసారి మెట్రిక్ గుద్దించిన మా బావకి. నీ డిగ్రీ పొజిషనూ గుర్తు చెయ్యనక్కరలేదు నేను. నీకు నీ తాహతుకి తగ్గట్టు, నీ దర్జా నిలబెట్టుకునేటట్టు ఎంత కట్నం డిమాండ్ చేస్తే బాగుంటుందో, నా నోటితో చెప్పించడమెందుకు, నువ్వే ఆలోచించుకో...."

"మనిద్దరం విడిపోయే వేళముందు మరో మాట అన్నావు. గుర్తుండే ఉంటుంది."

"ప్రకాశం, ఒకరు ఈర్ష్య పడినంత మాత్రాన మన సిరిసంపదలు తగ్గుతాయా! ఇప్పటికే సగం సాధించాను. ఇక నీ సహకారంతో లక్ష చేరుకోడానికి ఎంతో కాలం పట్టదు. ఇంతకన్న యేం సాధించాలి!"

అయిపోయింది! ఈ ఒక్క ముక్కతో అంకం పూర్తి అయింది. ఊహించని డబ్బుతో వచ్చిన వుక్కిరిబిక్కిరితో నువ్వు మగ్గిపోయావు. ముగ్గిపోయావు. ఎదిగావేమో అని భ్రమపడ్డాను. ముదిరిపోయావు, నీ నుంచి నేను ఆశించింది మెచూరిటీ. సెనిలిటీ కాదు. నాకు జీవితంలో కావలసింది ఉత్సాహంతో వురకలు వేస్తూ, హృదయానికి ఉన్న అన్ని కవాటాలూ పూర్తిగా తెరుచుకొని యెన్నెన్నో తెలుసుకోవాలనే తహతహతో యెదురు చూడడం. అన్ని తలుపులూ వేసేసుకొని జీవితాన్ని రౌండ్ ఆఫ్ చేసేసుకొని ఇక సాధించవలసింది లేదనుకోవడం మాత్రం కాదు.

'పాపం అక్కయ్య కాపురం బాగుచెయ్యాలి' అనేదానివి. 'గ్రాడ్యుయేటు అవుతాను. అక్కడితో మాత్రం ఆపేస్తామా?' అనేదానివి. 'తమ్ముడి చదువు పూచీ అంతా నేనే పైన వేసుకుంటాను' అనేదానివి. ఇప్పుడన్నీ పోయాయి. 'వీలైనంత రాబట్టండి' అని నీ తండ్రి మీదకే నన్ను ఉసిగొల్పేటంత దానివయ్యావు!

పూర్తిగా డబ్బు మనిషివైపోయావు మనోరమా!

ఇవాళే సింహాచలం వెళిపోతూ నీకీ ఉత్తరం పోస్టు చేస్తున్నాను. వారం రోజుల తర్వాత మా వాళ్ళని తీసుకొచ్చి ఇక్కడే ఉంటాను. ఒకే ఊళ్ళో ఉన్నా యిప్పుడు నీకూ, నాకూ చాలా దూరం.

నాక్కావలసింది నీ దగ్గరలేదని తెలుసుకున్నాను.

నువ్వే అన్నావు సగర్వంగా 'ఇప్పటికే సగం పైగా సాధించాను' అని. అంటే నీ మనస్సు వయస్సు యేభై పై మాట. ఇలాంటి నిన్ను స్వీకరించడం నాలాంటివాడికి కుదరదు.

సారీ!"

★